వీధికుక్కలు, కోతుల సమస్య

పరిష్కారానికి చర్యలు

ముషీరాబాద్, అంబర్‌పేట వెటర్నరీ అధికారి డా.వనజ

ఇంటర్వ్యూ...



ముషీరాబాద్, అంబర్‌పేట సర్కిల్ పరిధిలో వీధి కుక్కలు, కోతుల బెడద, రోడ్లపై సంచరించే మూగ జీవుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

రాంనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట సర్కిల్స్ పరిధిలో వీధికుక్కలు, కోతులు, రోడ్లపై సంచరించే మూగ జీవుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడతామని ముషీరాబాద్, అంబర్‌పేట సర్కిల్స్ జీహెచ్‌ఎంసీ వెటర్నరీ అధికారి డాక్టర్ వనజ తెలిపారు. కాచిగూడ కబేళాలో జీహెచ్‌ఎంసీ సర్టిపై చేసిన గొర్రెలు, మేకలు మాత్రమే వధించి విక్రయిస్తారని, ఎవరైనా జీహెచ్‌ఎంసీ అనుమతి లేకుండా గొర్రెలు, మేకలను వధిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వెటర్నరీ విభాగం నుంచి సమస్యలుంటే నంబర్ 21111111లో ఫిర్యాదు చేయాలని 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు.

వీధి కుక్కల కారణంగా వృద్ధులు, పిల్లలు బయటకు రాలేకపోతున్నారు. వాటి నివారణకు ఏం చేస్తున్నారు?

రెండు సర్కిల్స్ పరిధిలో వీధికుక్కల సమస్యపై తమకు ఫిర్యాదు చేయగా వెంటనే తాము డాగ్ స్క్వాడ్ ఆ ప్రాంతానికి పంపిస్తున్నాం, అక్కడ దొరికిన వీధి కుక్కలను పట్టి కూకట్‌పల్లిలోని డాగ్ సెంటర్‌కు తీసుకెళ్లి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించి వదులుతాం. కుక్కలపై నిరంతరం నిఘా పెట్టి వాటిని పట్టుకుంటున్నాం.

కోతుల బెడద చాలా తీవ్రంగా ఉంది. వాటి నుంచి ప్రజలకు ఏ విధంగా రక్షణ కల్పిస్తున్నారు?

కోతులను పట్టుకునే వారు ప్రస్తుతం ఎవరూ దొరకడం లేదు. తమకు ఫిర్యాదులు వచ్చిన ప్రాంతంలో వాటిని పట్టుకోవడానికి ప్రత్యేక బోన్‌లు ఏర్పాటు చేసి పట్టుకునే ప్రయత్నం చేస్తున్నాం. బోన్‌లో చిక్కిన వాటిని అటవీశాఖ అధికారులకు అందజేస్తున్నాం.

కల్తీ ఆహార పదార్థాలు, నాణ్యత నాన్‌వెజ్ విక్రయాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కల్తీ ఆహార పదార్థాలు, నాణ్యత లేని నాన్‌వెజ్ విక్రయాలు జరుగకుండా తనిఖీలు చేస్తున్నాం. నాణ్యత లేని మటన్, చికెన్ అమ్మితే ఆ దుకాణాలను సీజ్ చేస్తాం. అలాంటివి ఏమైనా ఉంటే ప్రజలు వెంటనే తమకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటాం.

ఆవులను వధించకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఆవులను వధించడం చట్టరీత్యానేరం. ఆవుల వధ జరుగకుండా కబేళాల్లో తనిఖీ నిర్వహిస్తున్నాం. ఆవుల వధ ఎక్కడ జరిగినా తమకు సమాచారం అందిస్తే వాటి నివారణ చర్యలు తీసుకుంటాం.

ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల మహాధర్నా వాయిదా

చిక్కడపల్లి: ఆటో, ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించతలపెట్టిన మహాధర్నాను వాయిదా వేసినట్లు యూనియన్ల జేఏసీ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సంత నిర్వాహకులు

సంతతో ట్రాఫిక్ జామ్ కాకుండా చూసుకోవాలి

నల్లకుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో వారాంతపు నిర్వహించే కూరగాయల సంత నేపథ్యంలో స్థానికంగా ట్రాఫిక్ జామ్ రద్దీ కాకుండా చర్యలు తీసుకోవాలని సంత నిర్వాహకులకు స్థానిక కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి సూచించారు. డివిజన్‌లోని రెడ్‌బిల్డింగ్ చౌరస్తా భరత్‌నగర్ వద్ద జరిగే కూరగాయల సంతపై ట్రాఫిక్ పోలీసులు అనుమతి నిరాకరించడంతో నిర్వాహకులు సోమవారం కార్పొరేటర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంత నిర్వహించడం వల్ల స్థానిక ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, ట్రాఫిక్ పోలీసులు, సంత నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మూసీ పేరుతో పేదల ఇళ్లను కూల్చడం తగదు



మాట్లాడుతున్న పి.సాయిబాబా, నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

రాంనగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చడం తగదని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా పేర్కొన్నారు. మూసీ సుందరీకరణలో కోట్ల రూపాయల అవినీతి, అక్రమాలు జరిగే ప్రమాదం ఉందని ఆరోపించారు. సోమవారం టీడీపీ నగర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడం లేదన్నారు. హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు మూసీ సుందరీకరణను తెరపైకి తీసుకొచ్చారన్నారు. టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

సదర్ విజయవంతం

చిక్కడపల్లి: టీపీసీసీ వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, ఎం పీ అనిల్‌కుమార్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు ఎన్టీఆర్‌స్టేడియం వద్ద నిర్వహించిన సదర్ కార్యక్రమం విజయవంతం అయిందని ఆలిండియా యాదవ మహాసభ ముషీరాబాద్ నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు ఎం.నరేందర్‌యాదవ్ తెలిపారు. సోమవారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ ఆయన మాట్లాడారు. గాంధీనగర్ డివిజన్ నుంచి పెద్దఎత్తున సదర్‌కు తరలివెళ్లినట్లు ఆయన వివరించారు.



భారీ దున్నతో ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎడ్ల హరిబాబు యాదవ్, ముఠా జైసింహ

ముషీరాబాద్‌లో సదర్ ఉత్సవాలకు ఏర్పాట్లు

ముషీరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): యాదవ కులస్థులు భక్తి శ్రద్ధలతో నిర్వహించే సదర్ ఉత్సవాలను ముషీరాబాద్‌లో ఘనంగా నిర్వహించేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్ హరియానా, గుజరాత్ నుంచి తీసుకువచ్చిన భారీ 4 దున్నలను సోమవారం ముషీరాబాద్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ దున్నలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సదర్ వేడుకల్లో ప్రత్యేకతను చాటే విధంగా ఎడ్ల హరిబాబుయాదవ్ ప్రతీ సంవత్సరం వివిధ రాష్ట్రాల నుంచి నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొన్నే భారీ దున్నలను తీసుకువస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో ముఠా జైసింహ, వరుణ్, అభినందన్ యాదవ్, సాయి, శ్రీధర్‌చారి, టెంట్‌హౌస్ శ్రీనివాస్, ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్, వివేక్, జావిద్ ఖాన్ పాల్గొన్నారు.



నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారిన పిల్లల ఆట పరికరాలు



పార్కులో గులకరాళ్లతో వాకింగ్ పాత్ వే

సుందరయ్యపార్కులో సమస్యల తిష్ఠ

● బాత్‌రూంలు ప్రారంభించడంలో జాప్యం ● మూత్ర విసర్జనకు ఇబ్బందులు పడుతున్న వాకర్స్ ● పాత్‌వే లేక వాకర్స్ అవస్థలు

రాంనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో పేరొందిన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కులో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. దీంతో పార్కుకు వచ్చే వాకర్స్, సందర్శకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ పార్కులో బాత్‌రూంలు లేక ఉదయం, సాయంత్రం వచ్చే వందలాది వాకర్స్ మూత్రవిసర్జనకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పార్కులో నూతనంగా టాయిలెట్ల నిర్మాణం చేశారు. కానీ నెలలు గడుస్తున్నా అందులో ఫ్లోరింగ్ పెండింగ్‌లో ఉండడం, నిర్వహణ కోసం ప్రత్యేక మనిషి లేకపోవడంతో వాటిని జీహెచ్‌ఎంసీ అధికారులు ఉపయోగంలోకి తేవడం లేదు. కొన్ని నెలలుగా టాయిలెట్‌కు తాళం వేసి ఉంచారు. పార్కులో టాయిలెట్స్ లేకపోవడంతో మహిళలు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో పార్కులో అక్కడక్కడ మూత్రవిసర్జన చేయడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. దీనికి తోడు పార్కులోని పాత్‌వే నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. నడకదారి కంకరతో గులకరాళ్లు తేలి ఉన్నాయి. దీంతో నడకకు వెళ్లే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ పాత్‌వే మట్టి పోసి వాకింగ్‌కు అనుకూలంగా తయారు చేయాలని పలువురు వాకర్స్ కోరుతున్నారు.



ప్రారంభోత్సవానికి నోచుకోని టాయిలెట్స్

నిరుపయోగంగా పిల్లల ఆట పరికరాలు

పార్కులోని పిల్లల ఆట పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. పిల్లల పరికరాలు ఉన్న చోట్ల చెట్లపై కొంగలు అధికంగా తిష్ఠ వేయడంతో అవి మలవిసర్జనతో పిల్లల ఆట పరికరాలు ఆడలేని విధంగా మారాయి. ఓపెన్ జిమ్ వద్ద కూర్చునేందుకు కుర్చీలు సైతం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ అధికారులు స్పందించి పార్కులో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని, నిర్మాణం పూర్తయినా టాయిలెట్‌లు ప్రజలకు ఉపయోగంలోకి తీసుకురావాలని పలువురు వాకర్స్ కోరుతున్నారు.

కాచిగూడలో మదర్సా విద్యార్థి అదృశ్యం



షేక్ రిజ్వాన్

బర్కత్‌పుర: కాచిగూడలో మదర్సా విద్యార్థి అదృశ్యమయ్యాడు. కాచిగూడ సీఐ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్టకు చెందిన వజీర్ కుమారుడు షేక్ రిజ్వాన్(14) కాచిగూడ పీఎస్ పరిధిలోని హర్రాజీపెంట మదర్సాలో అరబిక్ చదువుతున్నాడు. ఆదివారం మదర్సా నుంచి బయటకు వెళ్లిన షేక్ రిజ్వాన్ తిరిగి రాలేదు. పరిసర ప్రాంతాల్లో బాలుడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మదర్సా నిర్వాహకులు సోమవారం కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవాలి

చిక్కడపల్లి: సీఎం సహాయనిధికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ముషీరాబాద్ శాసనసభ్యులు ముఠా గోపాల్‌పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కవాడిగూడ డివిజన్‌కు చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు 4 లక్షలా 24 వేలరూపాయల చెక్కులను అందజేశారు. ముచ్చకుర్తి ప్రభాకర్, వల్లాల శ్యామ్‌యాదవ్, శంకర్‌ముదిరాజ్, రామ్‌చందర్, రాజేష్, సంతోష్ పాల్గొన్నారు.



షాపును ప్రారంభిస్తున్న హాకా ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

ఎన్టీఆర్ స్టేడియంలో 'హాకా' బాణాసంచా

కవాడిగూడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గడిచిన 43 ఏళ్లుగా జంట నగరాల వినియోగదారులకు విశేషమైన సేవలు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ హాకా (హైదరాబాద్ అగ్రికల్చరల్ కో ఆపరేటివ్ అసోసియేషన్) ఈ ఏడాది కూడా దీపావళి పండగను పురస్కరించుకొని హాకా బాణాసంచా ద్వారా సేవలు అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా శివకాశి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన స్టాండర్డ్ బ్రాండ్ నాణ్యమైన బాణాసంచాను 28 నుంచి 31వ తేదీ వరకు విక్రయించనున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఇందిరాపార్కు ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో 10 స్టాల్స్ ఏర్పాటు చేసి అనుభవజ్ఞులైన సిబ్బందితో అన్నిరకాల దీపావళి బాణాసంచా విక్రయిస్తున్నామని హాకా ఎండి కె చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు సోమవారం సాయంత్రం ఎన్టీఆర్ స్టేడియంలో హాకా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు సేవే లక్ష్యంగా ఎక్కువగా లాభాపేక్ష లేకుండా విక్రయిస్తున్నట్లు తెలిపారు. పార్కింగ్ సౌకర్యంతో పాటు అగ్నిమాపక కేంద్రం పోలీసు నియమ నిబంధనలకు అనుగుణంగా ఎలాంటి ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎస్ వి ప్రసాద్, సిబ్బంది బుజంగరావు, పద్మతోపాటు పలువురు పాల్గొన్నారు.

మూడేళ్ల బాలుడి కిడ్నాప్

● పోలీసుల ఉరుకులు పరుగులు
● 8 గంటల్లో ఛేదించిన ముషీరాబాద్ పోలీసులు
● సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఎస్సై

రాంనగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ పరిధిలో మూడేళ్ల బాలుడు కిడ్నాప్‌నకు గురయ్యాడు. దీంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి ఉరుకులు పరుగులు పెట్టి సీసీ కెమెరాలను జల్లెడపట్టి 8 గంటల్లో బాలుడి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జి.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్‌లో నివాసం ఉంటున్న అస్మాబేగం, మహమ్మద్ తాజుద్దీన్‌లు తమ మూడు సంవత్సరాల కుమారుడు ఎండి తాకి హమ్మదుతో కలిసి భోలక్‌పూర్ అహ్మద్‌నగర్‌లో తాజుద్దిన్ అన్న లాయక్ అలీ ఉమ్రాకు వెళ్తున్న సందర్భంగా నిర్వహించిన ఫంక్షన్‌కు ఈనెల 26న హాజరయ్యారు. మొదటి మరుసటి రోజు ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో మూడేళ్ల బాలుడు తాకి అమ్మద్ ఆడుకుంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆ సమయంలో అశోక్‌నగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయం సమీపంలో నివాసం ఉంటున్న రమాదేవి అనే మహిళ మటన్ (బీఫ్) కోసం ఓలా బైక్ బుక్ చేసుకొని అక్కడికి వచ్చింది షాప్ యజమానికి డబ్బులు ఆన్‌లైన్‌లో చెల్లించి మటన్ తీసుకొని తిరుగు ప్రయాణమయింది. అదే సమయంలో రోడ్డు పక్కన ఏడుస్తూ తాకి హమ్మదు కనిపించాడు. బాలుడి వివరాలు ఆరా తీయగా.. సమాధానం చెప్పలేదు. చుట్టుపక్కల వారిని అడిగితే ఎవరూ స్పందించలేదు. దీంతో ఆమె ఆ బాలుడిని వెంటబెట్టుకొని అశోక్‌నగర్‌లోని ఇంటికి వెళ్లింది. అయితే తమ కుమారుడు కనిపించకపోవడంతో బాలుడి తల్లి ఆదివారం సాయంత్రం ఏడు గంటల సమయంలో ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే పోలీసులు స్పందించి కేసు నమోదు చేసుకొని బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. బాలుడు తప్పిపోయిన ప్రాంతానికి వెళ్లి సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. బాలుడిని రమాదేవి తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఆ రికార్డుల ఆధారంగా రమాదేవి ఆచూకీ కనుగొనేందుకు పోలీసులు పలు బృందాలుగా విడిపోయి వెతికారు. రమాదేవి వెళ్లిన మటన్ షాపునకు పోలీసులు వెళ్లి ఆమె వచ్చిన బైక్, ఫోన్‌పే నంబర్‌లు తీసుకున్నారు. ఓలా బైక్ వ్యక్తి మాదాపూర్‌లో నివాసం ఉంటున్నట్లు గుర్తించారు. రాత్రి అశోక్‌నగర్‌కు తీసుకొచ్చి రమాదేవి ఓలా బైకు ఎక్కిన ప్రాంతాన్ని గుర్తించారు. అక్కడ లభించిన సీసీ కెమెరా ఫుటేజి ఆధారంగా రమాదేవి ఇల్లును సోమవారం తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు కనుగొన్నారు. ఇంట్లోకి వెళ్లి చూడగా.. బాలుడు అక్కడే ఉన్నాడు. ఆ బాలుడిని కిడ్నాప్ చేసి ఇంటికి తీసుకొచ్చిన రమాదేవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం రాత్రి 8 గంటలకు బాలుడిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడి ఆచూకీ కనిపెట్టడంలో కీలకంగా వ్యవహరించిన టాస్క్‌ఫోర్స్ ఎస్సై ప్రసాద్ రెడ్డి, సిబ్బంది సీహెచ్ మహేష్, జి సాయికుమార్, ప్రకాష్, శ్రీకాంత్‌లను ఉన్నతాధికారులు అభినందించారు. రోడ్డు పక్కన దొరికిన బాలుడిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించకుండా ఇంటికి తీసుకెళ్లిన కారణంగా రమాదేవిపై కిడ్నాప్ కేసు నమోదు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కవాడిగూడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉంటూ మద్యానికి బానిసై పెళ్లి కావడం లేదని సేల్స్‌మెన్ జీవితంపై విరక్తి చెంది పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సింగాడికుంటలో సోమవారం జరిగింది. గాంధీనగర్ సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సింగాడికుంటలో నివాసం ఉండే జంగం బాలు(32) సేల్స్‌మేన్‌గా బాటా షోరూం సమీపంలో ఓ హార్డ్ షాపులో విధులు నిర్వహిస్తున్నాడు. గత కొంత కాలంగా ఆయనకు వివాహం కాకపోవడంతో బాధతో మద్యానికి బానిసయ్యాడు. కుటుంబసభ్యులు అతడిని నిద్రలేపడానికి ప్రయత్నించగా లేవలేదు. దీంతో అతడిని అసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధృవీకరించినట్లు పోలీసులు తెలిపారు.

బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన పటేల్

చిక్కడపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన గొప్పయోధుడు సర్దార్ వల్లభాయ్‌పటేల్ అని రాష్ట్రపతి అవార్డుగ్రహీత డా.శాంతాబాయి అన్నారు. సూర్యాపేటకు చెందిన హోప్, సింధు ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయగానసభలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా పటేల్ జాతీయ స్ఫూర్తి పురస్కారాల ప్రధానసభ నిర్వహించారు. నిర్వాహక సంస్థల వ్యవస్థాపకులు దైద వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ రంగాల్లో ప్రముఖులు 62 మందికి పురస్కారాలు ప్రదానం చేశారు.



పురస్కారాలను బహూకరిస్తున్న శాంతాబాయి తదితరులు

ఇళ్లను కూల్చి రోడ్డు నిర్మాణానికి యత్నం

● అడ్డుకున్న బాధితులు, బీజేపీనేతలు ● వెనుదిరిగిన మున్సిపల్ సిబ్బంది

చిక్కడపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ స్వామివివేకానందనగర్ బస్తీలో 75 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న తమ ఇల్లును పది నెలల కిందట కూల్చేశారని తమకు పునరావాసం కల్పించకుండా ఇళ్లను కూల్చినచోట రోడ్డును వేస్తామంటే ఊరుకునేది లేదని బాధితులు ఎంబి కృష్ణ, శ్యామ్‌సుందర్, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు, తిలక్‌బాబుతదితరులు మున్సిపల్ అధికారులను అడ్డుకున్నారు. సోమవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్ 15 టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు స్వామివివేకానందనగర్‌కు చేరుకుని ఇళ్లను కూల్చినచోట రోడ్డు వేయడానికి సిద్ధమయ్యారు. ఈ క్రమంలో బాధితులు అక్కడకు చేరుకుని రోడ్డు పనులను అడ్డుకున్నారు. కోర్టు ఆర్డర్‌ను ధిక్కరించి తమ ఇండ్లను అక్రమంగా కూల్చేశారని ఇప్పుడు రోడ్డు వేస్తామంటే ఎలా ఊరుకుంటామని రోడ్డు వేయడానికి కోర్టు ఆర్డర్ ఉంటే చూపించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ అక్కడకు చేరుకుని అధికారులతో మాట్లాడారు. రోడ్డు వేయడానికి కోర్టు ఆర్డర్ చూపించాలని కోరడంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. కాగా కలెక్టర్‌తో మాట్లాడి ఇందిరమ్మ ఇండ్లలో స్వామివివేకానందనగర్ బస్తీ బాధితులకు ఇండ్లు ఇప్పిస్తానని మంత్రి తమకు హామీనిచ్చారని వినయ్‌కుమార్, బస్తీవాసులు తెలిపారు. బీజేపీ నేతలు ఉమేష్, సాయికుమార్, అశోక్‌యాదవ్, జగదీష్, బాబ్జి, బీఆర్ఎస్ నేతలు రాకేష్, పున్న సత్యనారాయణ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

గోల్నాక, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): గోల్నాక తులసీనగర్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా 11 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.3 లక్షల 25 వేల రూపాయల విలువైన ఆర్థిక సహాయం చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయంతో పేద, మధ్యతరగతి ప్రజలు మెరుగైన వైద్య చికిత్సలు పొందుతున్నారన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందేలా కృషిచేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గం ప్రజలతాను ఎల్లవేళల ముందుండి పని చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గం సమగ్రాభివృద్ధియే ధ్యేయంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు.

'ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి'

బర్కత్‌పుర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, రాష్ట్రంలో డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని అఖిల భారత అసంఘటిత కార్మికులు ఉద్యోగుల కాంగ్రెస్ (కెకెసీ) ఛైర్మన్ కౌశల్ సమీర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఇతర రాష్ట్రాల వాహనాలను పూర్తిగా కట్టడి చేయాలని, ఉబర్ యాజమాన్యం నడుపుతున్న ఉబర్ బస్ షటిల్ సర్వీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కిలో మీటరు ఆటో ధర పెంచాలని, డ్రైవర్లకు 12 వేల ఆర్థిక సహాయం అందించాలని, కార్పొరేట్ కంపెనీల దోపిడీ, బైక్ ట్యాక్సీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించారని నవంబర్ 5వ తేదీలోపు అన్ని సంఘాల నాయకులు రవాణా శాఖ కమిషనర్‌తో సమావేశం ఏర్పాటు చేసి విధి విధానాలు ప్రకటిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంపత్‌రెడ్డి, కె.రాజశేఖర్‌రెడ్డి, రుద్రక్ష మల్లేష్, కె.అనిత, హన్మంత్‌రెడ్డి, ఎం.నగేష్, బి.సత్యనారాయణ, యాదగిరి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



గాయనీగాయకులు, నృత్యకళాకారులను సత్కరించిన కృష్ణమోహనరావు

వేటూరి పాటలు సాహితీ సౌరభాలు

చిక్కడపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేటూరి సుందరరామ్మూర్తి రచించిన పాటలు సాహితీసౌరభాలు అని తెలంగాణ బీసీ కమిషన్ విశ్రాంత ఛైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహనరావు అన్నారు. స్వరకళ్యాణి ఆర్ట్స్ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయగానసభలో ఇది నా ప్రియనర్తనవేళ శీర్షికన వేటూరి రచించిన సినీగీతగానం జరిగింది. స్వరకళ్యాణి స్వరభాస్కర్, రామలక్ష్మి, జయరామ్, జ్యోతి, లత తదితరులు పలు వేటూరి పాటలు మధురంగా ఆలపించారు. వకుళాభరణం కృష్ణమోహనరావు పాల్గొని గాయనీగాయకులను, నృత్యకళాకారులను సత్కరించారు.

సదర్ ఉత్సవాలకు దున్నలు సిద్ధం

హరియాణ, గుజరాత్ నుంచి నగరానికి..
సందడి చేయనున్న నేషనల్ చాంపియన్ దున్నలు

ముషీరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినం సందర్భంగా యాదవులు నగరంలో నిర్వహించే సదర్ ఉత్సవాల్లో హరియాణా, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన భారీ దున్నలు సదర్‌లో అలరించనున్నాయి. నవంబర్ 2న నగరంలో నిర్వహించే సదర్ ఉత్సవాల్లో దున్నలు పాల్గొనే విధంగా ముషీరాబాద్‌కు చెందిన అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్, హరియాణా రాష్ట్రం నుంచి ప్రత్యేక వాహనంలో ఏడేళ్ల వయస్సున్న భారీ దున్న (గోలు) షేర్ (8 ఏండ్లు), గుజరాత్‌కు చెందిన శ్రీకృష్ణ (7 ఏండ్లు), విదాయక్ (8 ఏండ్లు) దున్నలను తీసుకొచ్చారు. ఈ దున్నలు భారీ ఆకారంలో ఉండడంతో అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నాయి.



శ్రీకృష్ణ, గోలు దున్నలతో ఎడ్ల హరిబాబుయాదవ్

దున్నల ప్రత్యేకత

ఆరు అడుగుల ఎత్తు, 1800 కిలోల బరువు ముర్రా జాతికి చెందిన గోలు దున్నా నేషనల్ చాంపియన్‌షిప్ పశువుల ప్రదర్శనలో రెండు సార్లు విజేతగా నిలిచింది. 5 లక్షల అవార్డు సైతం పొందింది. దీని యజమాని నరేందర్‌సింగ్ ముర్రా జాతిని ప్రోత్సహిస్తూ ప్రత్యేకంగా పెంచడంతో ఆయనను అభినందిస్తూ రాష్ట్రపతి, ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా పద్మశ్రీ అవార్డును పొందారు. షేర్ దున్నా, గుజరాత్‌కు చెందిన శ్రీకృష్ణ దున్నా సైతం పశుమేళాలో బహుమతులను పొందాయి. ఈ దున్నలకు రోజూ ఉదయం, సాయంత్రం రెండు సార్లు స్నానం చేయిస్తారు. 20 లీటర్ల పాలు తాగించడంతో పాటు యాపిల్స్ డ్రైఫ్రూట్స్, అరటిపండ్లు, బెల్లం, తదితర పండ్లను ఆహారంగా అందజేస్తారు.

సీఎం రేవంత్‌రెడ్డి సదరు ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించడం హర్షణీయమని మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్ తెలిపారు. యాదవుల ఐక్యతకు, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. సదర్ కోసం హరియాణా, గుజరాత్‌ల నుంచి దున్నలను తెచ్చారు.



పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు

ఓయూ ఇంటర్ కాలేజ్ క్రాస్‌కంట్రీ పరుగు పందెం

రాంనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజ్ స్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పరుగు పందెంలో అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు పథమ స్థానంలో నిలిచారు. ఈ కళాశాల నుంచి పాల్గొన్న విద్యార్థులు సిద్దు, ఆంజనేయులు, సాయివర్ధన్, భరత్‌కుమార్, ఆనంద్, హేమంత్‌లు 45 నిముషాలలో 10 కిలోమీటర్లు పరుగెత్తారు. అదే విధంగా ఇదే కళాశాలకు చెందిన షర్మిల, హోమిక, నాగవాణిలు 58 నిముషాలలో 10 కిలో మీటర్లు పరుగెత్తి మహిళా విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. వీరిని ఓయూ క్రాస్ కంట్రీ మెడలిస్ట్ నళిని మోహన్, ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, ప్రొఫెసర్ కె.దీప్ల, ఫిజికల్ డైరెక్టర్లు శ్రవణ్, పాండులు విజేతకు బహుమతులను అందజేశారు.